## 9

# దేవుడు ఓర్పును కోల్పోయినప్పుడు

## (1 రాజులు 21)

దేవుని ప్రేమ, దేవుని కరుణమీద పాఠాలను విని చదివి సంతోషిస్తాం, కాని దేవుని న్యాయం, పరిశుద్ధతల మీద ప్రసంగించకుండ దేవుని సంకల్పమంతటిని ప్రసంగించలేం. దేవుని పరిశుద్ధత పాపాన్ని సహించదు.

సామెతలు 29:1, "ఎన్నిసారులు గద్దించినను లోబడనివాడు మరి తిరుగులేకుండ హఠాత్తుగా నాశనమగును." ఈ వాక్యభాగం కృపతో ప్రారంభమవుతూ, మారడానికి తనకు ఒక దానివెంట ఒకటి వచ్చే అవకాశాలను కాలదన్ని దేవుని హెచ్చరికను మొండిగా తృణీకరించే ఒక వ్యక్తిని చిత్రీకరిస్తుంది. చివరికి, దేవుని ఓర్పు చేయి దాటిపోతుంది. మొండి ఘటంగా మారిన ఈ వ్యక్తి *"ఒక్కసారిగా*, సరిదిద్దలేనంతగా చెడిపోయాడు"! అయ్యో ఎంత భయంకరమైన పరిస్థితి అది![1]

ఈ సూత్రాన్ని ఆధారం చేసుకొని బైబిల్లో కొల్లలుగా ఉదాహరణలున్నాయి. ఈ జంట నగరాలు సొదొమా గొమొఱ్ఱాలకు కూడ పరివర్తన చెందడానికే అనేక అవకాశాలివ్వబడ్డాయి, ఉదాహరణకు నీతిమంతుడైన లోతు అనే భక్తుడు సొదొమాలో నివసించడానికి వచ్చినప్పుడు; వారింకా ఎక్కువ అవినీతికి పాల్పడినారు. ఆదికాండము 19వ అధ్యాయంలో ఆ రెండు పట్ట ణాలలో నీతి నియమాలు ఎంత దిగజారిపోయాయో భ్రష్టుపట్టి పోయాయో వివరించబడింది. చివరిగా, "ఇక చాలు" అని దేవుడు చెప్పాడు. హఠాత్తుగా, వారు "ఏ తిరుగు లేకుండనే నాశనమయ్యారు." దేవుడు వారిని భూమి మీద లేకుండ తుడిచిపెట్టాడు.[2]

ఇశ్రాయేలూ, యూదా రాజ్యాలు దేవుని సహనాన్ని ఓపికను సంవత్సరం తర్వాత సంవత్సరం పరీక్షించారు. వారిని వెనుకకు మరల్చడానికని దేవుడు అనేకమంది ప్రవక్తలను వారి వద్దకు పంపించాడు, "వారు దేవుని దూతలను ఎగతాళిచేయుచు, ఆయన వాక్యములను తృణీకరించుచు, ఆయన ప్రవక్తలను హింసించుచు రాగా, *నివారింప శక్యముకాకుండ* యెహోవా కోపము ఆయన జనులమీదికి వచ్చెను" (2 దినవృత్తాంతములు 36:16; నొక్కిచెప్పింది నాది). దేవుడు, "యిక చాలు" అన్నాడు. అకస్మాత్తుగా వారు నాశనమై పోయారు – మొదట ఇశ్రాయేలువారు, తర్వాత యూదావారు.

దానియేలు గ్రంథం 5వ అధ్యాయంలో బెల్షస్సరు విషయాన్ని గమనించండి. అతను అతని అతిథులు బాగా మత్తు పదార్థాలు త్రాగి తందనాలు ఆడినారు, విందారిగించారు, వారు దేవాలయంలోని పవిత్రమైన పాత్రలలో త్రాగినారు. ఆ సందర్భంలో అకస్మాత్తుగా "*ఆ గడియలోనే* మానవ హస్తపు వ్రేళ్లు కనబడి, దీపము దగ్గర రాజు యొక్క నగరు గోడ పూత మీద ఏదో యొక వ్రాత వ్రాయుచున్నట్టుండెను ..." (5 వచనం; నొక్కి చెప్పింది నాది): "*మెనే మెనే టెకేల్ ఉఫార్సీన్* ... ఆయన నిన్ను త్రాసులో తూచగా నీవు తక్కువగా కనబడితివి"

(25, 27 వచనాలు). "యిక చాలు!" అని దేవుడు అంటున్నాడు. ఆ రాత్రియందే పట్టణము పతనమై, బెల్షస్సరు హతుడైనాడు (30 వచనం). ఒక్కసారిగా "మరి తిరుగులేకుండ అతడు నాశనమైనాడు."

క్రొత్త నిబంధనలో హేరోదు అగ్రిప్ప గురించి చూస్తున్నాము (అపొస్తలుల కార్యములు 12). హేరోదు ప్రజా సమూహమందు నిలుచుండి వాక్చాతుర్యముతో గంభీరంగా ప్రసంగిస్తున్నాడు. జోసీఫస్ అనే చరిత్రకారుడు వ్రాస్తు, అతడు వెండి నగిషీపని చేసిన అంగీవేసుకునియున్నాడు అన్నాడు. ఉదయభానునిలా కిరణాల కాంతిలో తళతళలాడుచున్నాడు. "ఇది దైవస్వరమే ... !" అంటూ ఎలుగెత్తి ప్రజలు కేకలు వేశారు (22 వచనం). హేరోదు ప్రజలు యిచ్చిన ఘనతకు పొంగిపోయాడు. అప్పుడు దేవుడన్నాడు, "యిక అది చాలు!" అపొస్తలుల కార్యములు 12:23, "అతడు దేవుని మహిమపరచనందున *వెంటనే* ప్రభువు దూత అతని మొత్తెను." (నొక్కి చెప్పింది నాది.) జోసీఫస్ అనే చరిత్రకారుడు, హేరోదు రెండంతల భయంకరమైన కడుపునొప్పితో మెలికలు తిరిగి పోయాడని వ్రాస్తున్నాడు. అతడు మంచం మీదకు తేబడినాడు, ఆ నొప్పితో ఐదు రోజులు విపరీతమైన రోగంతో వేదన బాధలతో చనిపోయేవరకు శ్రమ పడినాడు. "అతడు పురుగులుపడి ప్రాణము విడిచెను" అని బైబిలు అంటుంది (23బి వచనం). కాబట్టి అతడు మరి "తిరుగులేకుండ హఠాత్తుగా నాశనమయ్యాడు."

యింకొక ఉదాహరణ కూడ యిక్కడ యివ్వ వచ్చు,[3] వాస్తవానికి చెప్పాలంటే, అహాబు యెజెబెలుల ఉదాహరణల కంటె యిక ఏ ఉదాహరణ కూడ శక్తివంతమైనది కాదు. అహాబు యెజెబెలులు తమ దుష్ట మార్గాలనుండి మరలి దేవుని శక్తిని ఆశ్రయించడానికి ఒక అవకాశం వెంట మరో అవకాశం వారికి యివ్వబడింది కాని వారు స్పందించలేదు. 1 రాజులు 21వ అధ్యాయమంతా వీరి లక్షణాలు మరి స్వభావాల వివరణ కోసం ప్రత్యేకించబడింది. దీంట్లో లేఖన భాగాల్లో అంతటికంటే నీచమైన కార్యాలు ఎక్కడ కానరావు. దేవుని ఓర్పు కూడ నశించిపోవడం మనం చూస్తున్నాం. అందుకే దేవుడు, "యిక ఇంతటితో చాలు!" అంటున్నాడు.

## నాబోతుకు వ్యతిరేకంగా పాపము (21:1-16)

"ఈ సంగతులైన తరువాత" అంటూ 21వ అధ్యాయము ప్రారంభించబడింది. అంటే ఏలీయా రంగంలోనుండి నిష్క్రమించినప్పుడు మరియు అహాబు యథావిధిగా తన కార్యకలాపాలు కొనసాగిస్తున్నప్పుడు, కర్మెలు పర్వతంనుండి అహాబు ఎంతో తలవంపులై దిగివచ్చాడు. కాని యెజెబెలు ఏలీయాను భయపెట్టినందున, ఏలీయా పారిపోయాడు. యిక తర్వాత అహాబు ఏలీయాను గూర్చి వినలేదు. అందుచేత అహాబు యథావిధిగా తన బతుకు తాను బ్రతుకుతున్నాడు. 19వ అధ్యాయంలో అతడు సిరియాతో చేసిన రెండు యుద్ధాలను గురించి దాంట్లో ఇశ్రాయేలీయులు అఖండ విజయం సంపాదించడం గూర్చి చదువుచున్నాము. (తర్వాత సిరియా రాజును అహాబు విడిచిపెట్టడంవల్ల నిందపాలవడం చూస్తున్నాం).[4]

"ఈ సంగతులైన తరువాత యెజ్రెయేలులో షోమ్రోను రాజైన అహాబు నగరును ఆనుకొని యెజ్రెయేలువాడైన నాబోతునకు ఒక ద్రాక్షతోట కలిగియుండగా" (1 వచనం). నాబోతు దేవుని మనుష్యులలో ఘనమైనవాడు. యెజ్రెయేలులో అహాబు నగరు ప్రక్కనే అతనికొక

ద్రాక్షతోట ఉన్నది. ఇశ్రాయేలు రాజధాని సమరయ, దక్షిణవైపుగా[5] చాలా మైళ్ళున్నది. కాని అహాబుకు యెజ్రెయేలులో అందమైన భవనం ఉంది. లౌకికపరమైన వృత్తాంతాలోనే కాక భవన నిర్మాణాల్లో కూడ అహాబు దిట్ట, సర్వసామర్థ్యంగలవాడని సెలవిస్తున్నాయి (1 రాజులు 22:39). యెజ్రెయేలులో ఉన్న ఈ శృంగార భవనము దాని చుట్టూ ఉన్న ప్రాంగణము ఎంతో శ్రద్ధతో ఉంచబడియున్నది, ఆ భవనం చుట్టూ పచ్చని పచ్చికతో రంగురంగుల పుష్పాల సముదాయంతో మొక్కలు, గుబుర్లు, నిటారైన చెట్లు అంతా కనులవిందు కలిగించేలా నిర్మించబడింది. ఒకే ఒక లోటు ఉన్నది. అదేమంటే ఆకులు, తాజా తాజా కూరగాయలు పండించుకోడానికి అహాబుకు చేరడంత భూమి కూడ లేదు. ఒక రోజు తను ఆ భవనపు కిటికీ గుండా తొంగి చూచినప్పుడు నాబోతు ద్రాక్షతోట యితని పాడు కళ్ళకి కనబడింది. యిక అహాబు దాన్ని కావాలని కోరాడు.

> అహాబు నాబోతును పిలిపించి – నీ ద్రాక్షతోట నా నగరునకు ఆనుకొనియున్నది గనుక అది నాకు కూరతోటకిమ్ము దానికి ప్రతిగా దానికంటే మంచి ద్రాక్షతోట నీకిచ్చెదను, లేదా నీకు అనుకూలమైన యెడల దానిని క్రయమునకిమ్మని అడిగెను (2 వచనం).

ఈ మాటలు మొదట్లో వినగానే, అహాబు ఉచిత రీతిలో మాట్లాడుతున్నాడని మనకనిపిస్తుంది. కాని అది దేవుని చిత్తానికే విరుద్ధమైనదిగా ఉంది. ఇశ్రాయేలు ప్రజలు ఆ దేశంలోకి వెళ్లిన వెంటనే వారికి వారి వారి గోత్ర ప్రకారం వారివారి కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి కొంత భూభాగము యివ్వబడింది. ఎవరి కుంటుంబానికివ్వబడిన భూమి వారికే నిలిచియుండాలి (లేవీయకాండము 25:24–34).[6]

“అందుకు నాబోతు – నా పిత్రార్జితమును నీకిచ్చుటకు నాకు ఎంతమాత్రమును వల్లపడదని చెప్పగా” (3 వచనం). నాబోతు తన భూమిని అమ్మకుండ ఉండడానికి బహుశ అనేక కారణాలుండియుండవచ్చు. ఈ ద్రాక్ష తోట గత చరిత్ర, ఆ జ్ఞాపకాలు ఎంతో మధురమైనవి. వాళ్ళ నాన్నగారు ఈ తోటలో పని చేశాడు. వాళ్ళ నాన్న, వాళ్ళ నాన్న యిలా కొనసాగినారు. ఆ రోజుల్లో నాబోతు చిన్న పిల్లవానిగా ఉన్నపుడు ఆ తోట నీడలో చక్కగా ఆడుకుంటూ గంతులేస్తున్న దృశ్యం నేను చూచాను. ఆ ద్రాక్ష పళ్ళు కడుపార భుజించేవాడు, ఆ రసాన్ని జుర్రుకునేవాడు, అ రసం నోటినుండి కారుతూ ఒంటినిండాపడేది. ఆ ద్రాక్షలనుండి కారే రసం ఊదా రంగు అతన్ని పూర్తిగా రంగరించుకొని అతనిని చూస్తుంటే భలే ముద్దొచ్చేవాడు. ఇప్పుడు అతను తన కుమారులతో కలిసి ఆ తోటను సాగు చేస్తున్నాడు. నాబోతు దానిని అమ్మకుండ ఉండడానికిగల కారణమేమంటే, “దాన్ని ఎవరికి యివ్వవద్దు అమ్మనూ వద్దు” అని దేవుడు చెప్పాడు. నాబోతు దేవుని మాట వినడానికి నిశ్చయించుకున్నాడు. బయలుకు మ్రొక్కని ఆ ఏడువేలమందిలో యితనూ ఒకడు (గమనించు 3వ వచనం).

అహాబు “మూతి ముడుచుకొనినవాడై కోపముతో” తన నగరుకు పోయెను:

> నా పిత్రార్జితమును నీ కియ్యనని యెజ్రెయేలీయుడైన నాబోతు తనతో చెప్పినదానినిబట్టి అహాబు మూతి ముడుచుకొనినవాడై కోపముతో తన నగరునకు పోయి మంచముమీద పరుండి యెవరితోను మాటలాడకయు భోజనము చేయకయు యుండెను (4 వచనం).

చిన్న పిల్లలు గనుక పగిలిపోయిన బొమ్మను తీసుకోక అలిగినట్టు అహాబు అలిగి పండుకున్నాడు.

యిది ఏదో మామూలు మనిషి అయితే పరవాలేదు, ఒక రాజు యిలా అలగడం విడ్డూరంగా ఉంది. యిక్కడ ఈ దృశ్యాన్ని ఊహించండి: ఒక వేళ అహాబు దంతాలతో నిర్మితమైన భవనములో ఉండియుండవచ్చు.[7] మరియు దంతాలతో చేసిన పందిరి మంచం మీద పవళించి యుండవచ్చు.[8] లోపల గోడలు కూడ చచ్చౌకముగా దంతాలతో పోతపోయబడి ఉండవచ్చునేమో.[9] అతని చుట్టూ ఇంత విలాసవంత భాగ్యవంతమైన భండాగారం ఉంటే ఆ పనికి మాలిన భూమి తనకు దొరకలేదని అలిగి పడుకోడం ఏం బాగుంది. కుప్పతిప్పలుగా పడివున్న శవాలు కళేబరాలు సిద్ధంగా ఉంటే హాయిగా భోంచేయడానికి బదులు, ఒక గద్ద ఎక్కడోపడివున్న ఆ పిచ్చుకలు దొరకలేదని అలిగిందట. అలావుంది అహాబుగారి వ్యవహారం. అహాబు ఒక ఆకలిగొన్న సింహంలాగ ఉన్నాడు. దాని చుట్టూ శవాల కళేబరాలు పడివుంటే ఎక్కడో మూలనవున్న ఆ ఎలుకపిల్ల తోలు దొరకలేదని అలిగిందట సింహం.

ఆ రోజు విందు బల్ల వద్దకు అహాబుగారు రాకపోవడం యెజెబెలును కలతకు గురిచేసింది. బహుశ ఆమె అతనికి పళ్ళెం నిండా కమ్మటి ఆహారం వండించియుండవచ్చుకాని అది అంత తన దగ్గరకు తిరిగి వచ్చింది. ఆ యింటి యజమానురాలు అసలు సంగతి ఏమిటో తెలుసుకుందామని బయలుదేరింది. అతని గదిలోకి ఆమె వచ్చింది. రావడం రావడం ఆమె చేసిన పనేంటంటే అతని నుదుటిని తాకి చూచింది. అబ్బే! జ్వరమేమి లేదే. “ఏమండీ ఏంటి అంత నీరసించిపోయారు అంత బుంగమూతిపెట్టావు అన్నం తిననంటున్నావ్. ఏం సంగతి? (5 వచనం) అతను మూలుగుకుంటూ మాట్లాడ్డం మొదలు బెట్టాడు:

> నీ ద్రాక్షతోటను క్రయమునకు నాకిమ్ము; లేక నీకు అనుకూలమైనయెడల దానికి మారుగా మరియెక ద్రాక్షతోట నికిచ్చెదనని, యెజ్రెయేలీయుడైన నాబోతుతో నేను చెప్పగా అతడు – నా ద్రాక్షతోట నీ కియ్యననెను (6 వచనం).

అహాబు నాబోతు చెప్పిన దేవుడు వద్దన్నాడు అనే విషయాన్ని ఆమెకు చెప్పలేదు. అతనికి ఆ విషయాలన్ని ముఖ్యం కాదు. అతని బాధెల్లా నాబోతు తన్ను ముఖం మీద కొట్టినంతపని చేశాడు.

యెజెబెలు అతన్ని లేపింది: “యిప్పుడు నీవు ఇశ్రాయేలీయులను పరిపాలిస్తున్నావా?” (7ఎ వచనం). వాస్తవానికి అహాబు ఇశ్రాయేలీయుల్ని ఏలడం లేదు – యెజెబెలు అమ్మగారే పరిపాలిస్తుంది. యిక్కడ ఆమె అనేదంతా ఏమంటే, “నీవు కోరుకున్నది నీవు సంపాదించుకోలేనంత దద్దమ్మవైతే నీవు ఇశ్రాయేలీయులమీద రాజు ఎలా కాగలవు? అప్పుడామె యిలా అన్నది, “లేచి భోజనము చేసి మనస్సులో సంతోషముగా నుండుము. నేనే యెజ్రెయేలీయుడైన నాబోతు ద్రాక్షతోట నీకిప్పించెదనని అతనితో చెప్పెను” (7బి వచనం). “ద్రాక్ష తోటను నేను నికిత్తును. నీవు దానిని *కొనెదవు.* నేను దానిని *నీకిత్తును.*”

ఇక్కడొక దేశాన్ని మనం చూస్తున్నాము. భర్త మీద పెత్తనం చేలాయించే భార్య, భార్య చేతిలో కీలు బొమ్మగా ఆడే భర్తను. సహజంగా వివేకము కలిగిన భార్య కనుక అయినట్లయితే తన భర్త ఒక నాయకునిగా చెలామణి కావాలని కోరకుంటూ అతన్ని ప్రోత్సహిస్తుంది. అన్ని వ్యవహారాల్లో పై చేయిగా ఉండాలని కోరుకుంటుంది. యిక్కడ శుంఠ భర్త అయినందువల్ల భార్య రంగంలో దిగాల్సి వచ్చింది. ప్రస్తుతం ఎదురైన సమస్యను ఎదుర్కొడానికి దగ్గరుండి అతన్ని ప్రోత్సహించడానికి దానికి బదులు “నీవు ప్రక్కకు తొలగ వయ్యా; ఆ సంగతి

నేను చూసుకుంటా"; అంటుంది. యిక ఈ అయ్యగారు కూడ సరే ఆమెనే చెయ్యని అని సంతోషంగా ప్రక్కకు తొలగుచున్నాడు.

మానవ చరిత్రలో ఎన్నడు నీతిని ఎరుగని కఠినమైన పన్నాగాన్ని తెలుసుకోబోతున్నాం. ఎవరో మాఫీయా బాస్స్ సంకల్పించియున్నట్టయితే మనం ఆశ్చర్యపడే పనిలేదు గాని దేవుని అభిషిక్తుడనబడిన వాని పేరిట చేయబడింది, ప్రజలమీద, రాజుగా ఉన్నవాని నామమున జరిగింది!

> ద్రాక్షతోట నీకిప్పించెదనని అతనితో చెప్పి అహాబు పేరట తాకీదు వ్రాయించి అతని ముద్రతో ముద్రించి, ఆ తాకీదును నాబోతు నివాసము చేయుచున్న పట్టణపు పెద్దలకును సామంతులకును పంపెను. ఆ తాకీదులో వ్రాయించినదేమనగా – ఉపవాసదినమున జరుగవలెనని మీరు చాటించి నాబోతును జనులయెదుట నిలువబెట్టి (8, 9 వచనాలు).

ఈ పన్నాగంలో దేవుని నియమాలు పరికరాలుగా వాడబడినవి. యెజెబెలు దేవుని నియమాలను ద్వేషించిన వ్యక్తి. ఈ విధంగా యెహోవా దేవుని నియమాలను విస్మరించడంలో ఆమెకుగల సంతోషం ఏమిటో మనకర్థం కాదు. దారి మళ్ళించిన మొట్టమొదటి నియమము ఉపవాసాన్ని ప్రకటించడం. ఉపవాసాలు అనేవి దేవుని కోపాగ్నిని మళ్ళించడానికి చేసేవి (గమనించు 2 సమూయేలు 21:2; యెహోషువ 9:11; ద్వితీయోపదేశకాండము 21:9).

ప్రజలను పాల్గొనునట్టు చేసే రెండవ నియమము వక్రీకరించబడింది. దేవుడు ప్రజలందరి పట్ల కోపాగ్నితో ఉన్నాడు. కాబట్టి ప్రజలందరూ కలిసి ఉపవాసము చేయవలసియున్నది. ఎవరో ఒక పౌరుడు తెలిసి తెలియక చేసిన తప్పువల్ల పట్టణం మొత్తం అపనిందకు గురైనట్టుగా నాయకులు ఇప్పుడు నటించాలి. ఆకాను విషయంలో యెహోషువ చేసిన వివేకవంతమైన కార్యాన్ని మనం చూడగలం (యెహోషువ 7).

నాబోతు ప్రజలందరి ద్వారా గౌరవించబడిన వ్యక్తి అని జోసీఫస్ వ్రాస్తున్నాడు. అతడు, "జనులయెదుట నిలువబెట్టి" అనడం ప్రజల్లో అతనికున్న గౌరవ స్థానాన్ని తెలుపుతుంది.

యెజెబెలు యొక్క సూచనలు కొనసాగినవి: "నీవు దేవునిని రాజును దూషించితివని అతని మీద సాక్ష్యము పలుకుటకు పనికిమాలిన యిద్దరు మనుష్యులను సిద్ధపరచుడి; తీర్పు అయినమీదట అతనిని బయటికి తీసికొనిపోయి రాళ్లతో చావగొట్టుడి" (10 వచనం). మూడు యెహోవా నియమములు ఈ పన్నాగాలవలన వక్రీకరించబడ్డాయి: (1) ఒకరిపై నేరారోపణ చేయబడాలంటే యిద్దరు ముగ్గురు సాక్షులతో అది స్థిరపరచబడాలి (సంఖ్యాకాండము 35:30; ద్వితీయోపదేశకాండము 17:6; 19:15); (2) దేవ దూషణ ఎంత భయంకరమైన పాపమంటే దానికి శిక్ష మరణశిక్ష. (దేవుని ప్రతినిధియైన రాజుయెడల దూషణ చేసినవాడు దేవునికూడ దూషించినట్లే అని నిరూపించబడుతుంది; చూడు లేవీయకాండము 24:15); మరియు (3) దేవ దూషణ చేసిన వానిని రాళ్లతో కొట్టిచంపాలి అని శాసనమున్నది (లేవీయకాండము 24:14–16). యెజెబెలు మనసు ఎంత దుష్టమైనదో కదా!

దేశం లోని నీతి నియమాలు, ఆత్మీయ స్థాయి గురించి 11 వచనంలో ఉంది (అదిగాక యెజెబెలు రేపిన భయాందోళనలతో కలిపి): "అతని పట్టణపు పెద్దలును పట్టణమందు నివసించు సామంతులును యెజెబెలు తమకు పంపిన తాకీదు ప్రకారముగా జరిగించిరి."

నాబోతు ఉదయాన్నే లేవగా ఏం జరిగిందో ఊహించుదాం. తన భార్యతో కుమారులతో

కలసి ఉదయం అల్పహారం తిన్నాడు. అంతలో అ పట్టణంలో గొప్ప ఉపవాసము జరుగబోతుంది. పుర జనులంతా రావలసిందని వర్తమానం వచ్చింది.

నాబోతు సూచించబడిన స్థలానికి చేరుకున్నాడు. అందరిలో తనకొక గౌరవప్రదమైన స్థానం వచ్చినందుకు ఎంతో ఆనందోత్సాహంతో ఆశ్చర్యంతో నిండిపోయాడు. యిక అసలు విషయం ప్రారంభమైనది. "ఎందుకండి దేవుని ఉగ్రత మనపై రగులుకొని ఉంది? పాపం ఎక్కడ దాగి ఉంది?" అని ప్రజలు అడిగారు, నాబోతుకు ఎక్కడాలేని ఆశ్చర్యం కలిగించేలా యిద్దరు వ్యక్తులు లేచి నిలుచున్నారు – ఆ సమాజంలో చెడ్డ పేరున్నవారు ఎలాంటి గౌరవ ప్రతిష్టలు లేని యిద్దరు వ్యక్తులు లేచి నిలుచున్నారు. వారు నడుచుకుంటూ వచ్చి నాబోతు కెదురుగా నిల్చుండి, అతనివైపు వ్రేలు చూపుతూ "నాబోతు దేవ దూషణ చేశాడు. రాజును కూడ దూషించినాడు." అదంతా ఏదో నవ్వులాట అని నాబోతు అనుకున్నాడు, "అయినావారి మాటలను ఎవరు లెక్కచేస్తారు, ఎవరు నమ్ముతారు" అనుకున్నాడు. ఒక్క సారి చుట్టూ కలియ జూశాడు నాయకులు పెద్దలు కోపోద్రిక్తులై యుండడం గమనించాడు. అతని స్నేహితులు ఇరుగుపొరుగువారు అతనిని విడిచి వెళ్ళారు.

నాబోతు పట్టణం బైటకు ఈడ్వబడినాడు. నాబోతు "అంతటితో ఆ భయంకర సంఘటన" ఆగిపోతుందనుకున్నాడు, చివరకు రాళ్లతో కొట్టే రాళ్ల తిప్ప దగ్గరకు చేరుకున్నారు. నాబోతును బలవంతంగా మోకరిల్లజేశారు. యిద్దరు సాక్షులు పెద్దపెద్ద బండరాళ్లుచేతబట్టుకొని ముందుకురికారు. బాధ వేదనమొదలైయింది. అతని తలమీద శరీరం మీద కుప్పలుకుప్పలుగా రాళ్లవర్షం కురిసింది. అతని దేహం చిన్నాభిన్నమయింది. పుర్రెపగిలిపోయింది, నాబోతు తుది శ్వాస విడిచాడు, మరణించాడు. దేవుని మాటకు కట్టుబడిన వ్యక్తి హతసాక్షియైనాడు.

అంతటితో ఈ దురాగతం ఆగిపోలేదు. నాబోతు ద్రాక్షాతోటను వేరేవారు స్వంతం చేసుకుంటారు. యింతవరకు జరిగిన అవకతవకలు అన్ని సరికావలసి ఉంది. పది అధ్యాయాల తర్వాత 2 రాజులు 9:26లో భయకంపితులనుచేసే విషయాలు తోడైయున్నాయి, ఈ విషయాలను 1 రాజుల 20 అధ్యాయంలో కనబడవు: వారు అంతటితో ఆగలేదు నాబోతు కుమారులను సైతం నిర్దాక్షిణ్యంగా చంపివేశారు.

"తర్వత వారు నాబోతు రాళ్లతో కొట్టబడి చంపబడినాడని యెజెబెలుకు వర్తమానం పంపించారు" (14 వచనం). యెజెబెలు ఉత్తరంలో అహాబు పేరు వ్రాసింది. అంతేగాని ఎవరిని కించపరచలేదు. ఆ పుర ప్రముఖులకు ఆ ఉత్తరం ఎవరు పంపినారో బాగా తెలుసు. అసలైన అధికారి ఎవరో వారికి కూడ బాగా తెలుసు, ఎవరికి వారు వార్త తెలుపవలయునో వాళ్లకు తెలుసు.

యిక్కడ తన అందమైన ఉద్యాన వనంలో విహరించడం, రాజుగారి సంగీత బృందం వీనలు విందుగా అందిస్తున్న శ్రావ్య సంగీతాన్ని ఆలకిస్తూ ఆనందడోలల్లో తేలిపోతున్న యెజెబెలును ఒక్క సారి కల్పన చేసుకోండి. "నాబోతు రాళ్లతో చంపబడినాడు" అనే వార్త బయలుదేరింది. యెజెబెలు హృదయం కఠినమైయింది. పాపం తన భర్తను కుమారులను పోగొట్టుకొన్న స్త్రీ గుండె చెరువై రక్తపు మడుగులో పడియున్న వారికోసం రోదిస్తుంటే, మరో ప్రక్క ఆకలితో అవురావురుమంటున్న కుక్కలు తన ప్రియమైన[11] భర్త బిడ్డలయొక్క రక్తం నాకుతుంటే గుండె పగిలి రోధిస్తున్న ఆ మహాసాధ్విని చూచి జాలితో కన్నీరు పెట్టడానికి బదులు యెజెబెలు ఈ దృశ్యాన్ని కనులవిందుగా తిలకిస్తోంది. తనవారి శవాలను అంత్యక్రియలకోసం సిద్ధపరస్తూ

ఆ మిగిలిన దేహాల ముక్కలను ఒక్కోచోట ఏరుతూ తన కన్నీటి తర్పణలతో వారి దేహాలు శుద్ధి చేస్తున్న కారుణ్య మూర్తిని కరుణించడానికి బదులు కిలకిలా నవ్వుతోంది యెజెబెలమ్మ అంతటితో సరిపోక తన భర్తతో సరసాలాడ్డానికి విలాసమందిరానికి తరలి వెళ్ళింది. ఆ దేశపు శాసనమిలా[12] చెబుతుంది, దేశ ద్రోహి రాజు కిరీటానికే ఎసరు పెట్టిందట.

> నాబోతు రాతి దెబ్బలచేత మరణమాయెనని యెజెబెలు విని – నాబోతు సజీవుడు కాడు, అతడు చనిపోయెను గనుక నీవు లేచి యెజ్రెయేలీయుడైన నాబోతు క్రయమునకు నీకియ్యనొల్లక పోయిన అతని ద్రాక్షతోటను స్వాధీనపరచుకొనుమని అహాబుతో చెప్పెను (15 వచనం).

"ఏమయ్యా అహాబు, నేను చేస్తానని చెప్పాను కదా, చేసిచూపించా చూచావా!" అని గొప్పలు చెప్పుకుంటుంది యెజెబెలు.

ఈ అలుగుల రాయుడికది ఎక్కడా లేని ప్రోత్సాహమిచ్చింది! "నాబోతు చనిపోయెనని అహాబు విని లేచి యెజ్రెయేలియుడైన నాబోతు ద్రాక్షతోటను స్వాధీనపరచుకొనబోయెను" (16 వచనం). యిక అహాబు ఎక్కడలేని ఉత్సాహంతో గబగబా దుస్తులు వేసుకొని బహుశ గబగబ నాలుగు మెతుకులు నోట్లో వేసుకొని, పాటలు పాడుకొంటూ ఆ ద్రాక్ష తోటవైపుగా వెళ్లినాడు.

## దేవుని ఓర్పు అంతరించిపోయింది

## (21:17-24, 27-29; 22:38; 2 రాజులు 9:21-36)

అదీ సంగతి. దేవుని ఓర్పు పూర్తిగా అంతరించి పోయింది. దేవుడు "యిక చాలు" అంటున్నాడు. 17వ వచనంలో, "అప్పుడు యెహోవా వాక్కు తిష్బీయుడైన ఏలీయాకు ప్రత్యక్షమై." యిక్కడ "యెహోవా వాక్కు" మరలా చూస్తున్నాం. అంటే ఏలీయా మరల తన కార్యనిర్వాహణకు పూనుకున్నాడు! దేవుడు ఏలీయాకు ఆజ్ఞయిస్తున్నాడు,

> నీవు లేచి షోమ్రోనులోనున్న ఇశ్రాయేలు రాజైన అహాబును ఎదుర్కొనుటకు బయలుదేరుము, అతడు నాబోతుయొక్క ద్రాక్షతోటలో ఉన్నాడు; అతడు దానిని స్వాధీనపరచుకొనబోయెను. నీవు అతనిని చూచి యీలాగు ప్రకటించుము – యెహోవా సెలవిచ్చునదేమనగా – దీని స్వాధీనపరచుకొనవలెనని నీవు నాబోతును చంపితివిగదా యెహోవా సెలవిచ్చునదేమనగా– ఏ స్థలమందు కుక్కలు నాబోతు రక్తమును నాకెనో ఆ స్థలమందే కుక్కలు నీ రక్తమును నిజముగా నాకునని అతనితో చెప్పెను (18, 19 వచనాలు).

అహాబు కొత్తగా సంపాదించుకున్న ఆస్తి ద్రాక్షతోటలో తన అనుచరులతో కలసి నడుస్తున్నాడు. ఈ తోటకు సాగుచేసే విషయంలో తానే ప్రణాళిక వేసుకుంటున్నాడు: "యిక్కడ కొన్ని టమాటాలు వేస్తా … అదిగో అవతల ఉల్లి గడ్డలు … ఆ అక్కడ దోసకాయలు … సరే వద్దువద్దు. అబ్బే అలాకాదు." అహాబు గనుక కళ్ళప్పగించి జాగ్రత్తగా చూస్తే అక్కడ ఎదురుగా నేల మీద పెద్ద పెద్ద పాదాల మలుపులు కనిపిస్తున్నాయి. ఓహో నాబోతు పాద ముద్రలు, యింక ప్రక్కనే కొంచెం చిన్న పాద ముద్రలు అతని భార్యవి యింకా కొంచెం అవతల యింకా చిన్న చిన్న పాదాలు వారి కుమారులవి – కాని అహాబు కళ్లు పొరలు కమ్మివున్నాయి.

అతనికేం కనబడ్డంలేదు సుమా! మరో క్షణంలోనే ఏదో అడుగుల చప్పుడు వింటున్నాడు. ఒక్క సారి తల త్రిప్పి చూచాడు ఆ ఎవరో కాదు తన మనస్సాక్షిమీద దెబ్బతీసిన బద్ధ శత్రువు ఏలీయా, అదే మోటు వస్త్రధారణ, చింతనిప్పుల్లాంటి నేత్రాలు అతను కనుకొనల్లోనుండి వెలిగిపోతున్నాయి, అహాబు కేకవేశాడు, "నా పగవాడా, నీ చేతిలో నేను చిక్కుబడితినా" (20ఎ వచనం). కొంతమంది రచయితలు యిదే మాటలను మరోవిధంగా, "నన్ను వెతికి పట్టుకున్నావా?" అని పలికాడు. ఏలీయా జవాబిచ్చాడు, "నేను నిన్ను కనుగొన్నది [నీకు నేను శత్రువైనందున కాదు గాని నీ పాపాలను బట్టి మాత్రమే], యెహోవా దృష్టికి కీడుచేయుటకు నిన్ను నీవే అమ్ముకొనియున్నావు గనుక" (20బి వచనం).

ఏ వ్యక్తి అయితే దుష్టత్వానికి తనకు తానుగా అమ్ముడు పోతాడో అతడు ఎందుకూ విలువలేక మిగిలిపోయాడని అర్థం. ఆకాను కూడ విలువైన వస్త్రానికి బంగారానికి తన్నుతాను అమ్ముకున్నాడు గనుక అతని జీవితాన్నే వృథా చేసుకున్నాడు. యూదా ముప్పది వెండి నాణెములకు తన్ను తాను అమ్ముకున్నాడు గనుక దానివల్ల అతనేమియు పొందలేదు. అహాబు కూడ ఒక ముక్క భూమికై తన్నుతాను అమ్ముకున్నాడు గనుక వాడు రోజులు లెక్కపెట్ట వలసి వచ్చింది.

కొంతమంది ఆక్షేపించవచ్చు: "ఒక్క నిమిషం ఆగండి. అహాబు నాబోతును చంపనే చంపలేదు; అసలు అతనితో యిలాంటి ఒప్పందాలలోకి దిగనేదిగలేదు." సరి అది నిజమే అనుకోండి, అలాంటప్పుడు ఎప్పుడో ఒకసారి ఏమి జరగుతుందో అహాబు ఎరిగియుండవచ్చు. ఒకటైతే వాస్తవం: దేవునికి వ్యతిరేకమైన కార్యాలు చేస్తూ తత్ఫలితాలను ఎదుర్కొడానికి సంసిద్ధుడైనాడు. గృహములో చేసే తీర్మానాలకు భర్తలే దానికి బాధ్యత వహించాలని బైబిల్‌లో అంతటా చూస్తున్నాము. ఒక తండ్రిగాను, భర్తగాను బాధ్యతలు స్వీకరించడం సామాన్యమైన విషయం కాదు. ఏది చేయాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచించి చేయండి!

యిదిగో వినాశనం దగ్గరకు రాబోతుంది జాగ్రత్త అన్నట్టుగా ఉంది ఏలీయా స్వరం:

> అందుకు యెహోవా ఈలాగు సెలవిచ్చెను – నేను నీ మీదికి అపాయము రప్పించెదను; [యిక్కడ కొంత సరదా మాటలను చూడవచ్చు; దుష్టత్వానికి నిన్ను నీవే అమ్మివేసుకొంటివి గనుక దానికే నేను నిన్ను అప్పగింతును] నీ సంతతివారిని నాశనము చేతును; అల్పులేమి ఘనులేమి ఇశ్రాయేలువారిలో అహాబు పక్షమున ఎవరును లేకుండ పురుషులనందరిని నిర్మూలము చేతును. ఇశ్రాయేలువారు పాపము చేయుటకు నీవు కారకుడవై నాకు కోపము పుట్టించితివి గనుక నెబాతు కుమారుడైన యరొబాము కుటుంబమునకు అహీయా కుమారుడైన బయెషా కుటుంబమునకును నేను చేసినట్లు నీ కుటుంబమునకు చేయుదునని యెహోవా సెలవిచ్చుచున్నాడు (21, 22 వచనాలు).

ఏలీయా రెండు గృహాల గురించి మాట్లాడుచున్నాడు, యరొబాము విషయములో బాషా విషయంలో వారు వారి పాపంవలన బహిష్కరింపబడినారు. ఏలీయా యింకా యిలా అంటున్నాడు:

> మరియు యెజెబెలును గూర్చి యెహోవా సెలవిచ్చునదేమనగా – యెజ్రెయేలు ప్రాకారమునొద్ద కుక్కలు యెజెబెలును తినివేయును. పట్టణమందు చచ్చు అహాబు సంబంధికులను కుక్కలు తినివేయును; బయటిభూములలో చచ్చువారిని అకాశపక్షులు తినివేయును అని చెప్పెను (23, 24 వచనాలు).

యిలాంటి నాశనానికి ఈడ్చే సంఘటనలు, సందర్భాలను గురించి ఆలోచించడం అంత సులువైన విషయం కాదు.

మనం తెలుసుకోవలసిన మరొక వివరణ యిక్కడుంది: 2 రాజులు 9:25 చూచినట్లయితే, ఏలీయా అహాబును ఎదుర్కొనియున్నప్పుడు మరో యిద్దరు వ్యక్తులు అక్కడున్నారు. ఒకరు అహాబు యొక్క సైన్యాధిపతియైన యెహు, యితడు అహబు స్థానంలో ఉండబోతున్నాడని దేవుడు చెప్పియున్నాడు (1 రాజులు 19:16f.). ఔను ఈ సందేశం యెహు మనసు పై చెరగని ముద్రవేసింది, స్థిరంగా నిలిచిపోయింది అనడంలో ఏ సందేహం లేదు.

27వ వచనంలోకి వచ్చేసరికి ఏదో అనుకోకుండ అకస్మాత్తుగా అచ్చెరువు కలిగించే సంఘటన జరిగింది. అహాబు భయకంపితుడైనాడు. “అహాబు ఆ మాటలు విని తన వస్త్రములను చింపుకొని గోనెపట్ట కట్టుకొని ఉపవాసము ఉండి, గోనెపట్ట మీద పరుండి వ్యాకులపడుచుండగా” దేవుడు మరలా తాను కృపా కనికరములుగలవాడనని చూపించాడు. ఆ విధంగా అహాబు దుఃఖపడడంవలన కొన్ని సంవత్సరాలవరకు విడిచిపెట్టబడినాడు.

> యెహోవావాక్కు తిష్బీయుడైన ఏలీయాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను – అహాబు నాకు భయపడి వినయముగా ప్రవర్తించుట చూచితివా? నాకు భయపడి అతడు వినయముగా ప్రవర్తించుటచేత ఆ అపాయములు అతని కాలమునందు సంభవింపకుండ ఆపి, అతని కుమారుని కాలమునందు అతని కుటుంబికులమీదికి నేను దాని రప్పించెదను (28, 29 వచనాలు).

ఈ వచనాల్లో రెండు శక్తివంతమైన సందేశాలను మనము కనుగొంటాం. మొదటిది అహాబులాంటి కఠినుడు కూడ స్పందిస్తాడు. రెండవది అహాబులాంటి వారి పట్ల కూడ దేవుడు తన వాగ్దానాలను గౌరవిస్తాడు. యిది క్లైడర్ మిల్లర్ అనేవాడు పరిశోధించి కనుగొన్నాడు:

> యూదా ఇశ్రాయేలీయుల దృష్ట రాజులు దేవుని వైపు తిరిగినప్పుడు ఆయన కనికరముగలవాడై యుండగా, మరియు దేవుడు “ప్రధాన పాపులను” రక్షించగలడు (1 తిమోతి 1:15), మారుమనస్సు పొంది తనకు విధేయులైన వారందరిని రక్షించు ఆయన శక్తి సామర్థ్యాలకు, యిష్టమునకు హద్దులు లేవు (హెబ్రీయులకు 5:7–9).[13]

ఈ అధ్యాయం అంతటిలో ఆగిపోయింది కాని కథ మాత్రం ఆగిపోలేదు. అహాబు యొక్క పశ్చాత్తాపం అది ఒక నిజమైన పశ్చాతాపం అనబడిందైతే, అది కొద్ది కాలంలోనే చల్లారిపోయింది. అహాబుకు ఏమి జరగలేదు. *మూడు సంవత్సరాలు* అలాగే గడిచిపోయాయి (1 రాజులు 22:1), ఏమి జరుగలేదు. అహాబు మీదకు తెగులు దిగిరాలేదు. ఆకాశంనుండి ఎలాంటి ఉరుములు మెరుపులు దిగిరాలేదు. భూమి రెండుగా చీలి యెవరిని మ్రింగివేయనూ లేదు; అహాబు తన పాత పద్ధతిలోకి జారిపోయాడు.[14] వారి భోజనపు బల్లమీద యెజెబెలుగారు ఒక మంచి కలగూరల ఘుమఘుమలాడే వంటకాన్ని అహాబు ముందుంచి యిలా అంటుందని నేను ఊహించుకుంటున్నాను, “ఏమండి అహబుగారు కొంచెం చిక్కుడుగాయ కూర వేసుకోండి, సరే క్యారట్ కొంచెం వడ్డించమంటారా. యివాళ మన తోటలోనుండి కోసిన ఫ్రెష్ కూరగాయలండి అవే స్వయంగా మీకు వండి వడ్డిస్తున్నా.” బహుశ, ఆమె ఒక్క చిరునవ్వు నవ్వుతూ, “ఆ ముసలాడు ఏలీయా ఏదో వాగాడని ముఖం యింత చేసుకున్నాడేం. ఆ నాబోతు

రక్తం కుక్కలు ఎక్కడ నాకినాయో అక్కడనే నీ రక్తం కూడ నాకుతాయి అన్నందుకా" అని అనియుండవచ్చు. బహుశ దగ్గర్లో ఏ కుక్క మొఱిగినా అహాబు గడగడ వణకుచుండవచ్చు.

యిక దాంతో మనం 22వ అధ్యాయంలో చేరుకున్నాం. అప్పటివరకు సిరియా వారితో యిక మూడు సంవత్సరాల వరకు యుద్ధమే లేదు; యిక యిప్పుడే మొదలైంది. తాను ఏది చేస్తానని బెన్హదదు చెప్పినాడో అది బెన్హదదు యింకా చేయలేదు; రామోత్గిలాదు యింకా తన సిరియవారి హస్తాల్లోనే ఉంది. అహాబు యూదా రాజుల సహాయాన్ని అర్థించి యుద్ధ సన్నాహాలకు సిద్ధమవుతున్నాడు. దేవుని ప్రవక్త ఒకడు వెళ్ళవద్దని హెచ్చరిక చేశాడు. అహాబు ఆ ప్రవక్త మాటలు పెడచెవిని బెట్టినాడు, యింతాచేసి తనకై తాను లోలోపల భయకంపితుడై యున్న సంగతి గుర్తించినా అలా చేస్తున్నాడు. యుద్ధానికి మారు వేషంలో వెళ్ళినాడు. రాజ వస్త్రాలు ధరించి తన కవచాన్ని ధరించడం ఆచారమైనప్పటికి అతను ధరించలేదు. సిరియా రాజైన బెన్హదదు అహాబును గాలించి పట్టుకోడానికి ముప్పదిరెండు రథాలను రథసారథులను పంపించాడు కాని అహాబును కనుగొనలేక పోయారు. యింతలో ఒక విలుకాడు గురిపెట్టకుండ ఎరలేకుండ గాలిలోకి ఒక బాణాన్ని కొట్టాడు, కాని ఆ బాణం సూటిగా వెళ్ళి అహాబు కవచంలో తిన్నగా దూసుకు పోయింది. అతని రక్తనాళంలోకి గుచ్చుకొని గాయపరచింది. అహాబు తన రథంలో ప్రక్కకు ఒరిగి తాను ఏమి గాయపడలేదన్నట్టు కనబరచుకుంటున్నాడు. వేగంగా కొట్టుకుంటున్న గుండెనుండి వేడి రక్తం చిమ్మింది అతని వస్త్రాలను తడిపి రథానికి పారి నేలను తడిపింది. అహాబు చచ్చి నేలకొరిగినాడు. అదే 38 వచనంలో చదువుతాం, "... ఒకడు ఆ రథమును షోమ్రోను కొలనులో కడిగినప్పుడు యెహోవా సెలవిచ్చిన మాట చొప్పున కుక్కలు వచ్చి అతని రక్తమును నాకెను." దేవుని వాక్కు ఆయన వాగ్దానాలు తప్పక నెరవేరతాయి.

యిక యింతటితో కథ అయిపోలేదు. *యిరువది* సంవత్సరాలు కాలక్రమంలో దొర్లిపోయాయి. దేవుని మార్గాలు మన మార్గాలవంటివి కాదు, ఆయన కార్యక్రమాలు మన కార్యక్రమములవంటివి కాదు, ఆ యిరువది సంవత్సరాల కాలంలో ఎన్నో విషయాలు జరిగిగాయి. ఎన్నో పరిస్థితులు సంభవించాయి. ఏలీయా సుడిగాలిలో పరమునకెళ్ళినాడు. ఎలీషా తన గొప్ప సేవను ప్రారంభించాడు. అహాబు కుమారుడు యెహోరాము లేదా యోరాము రాజ్యానికి వచ్చాడు. రాణియైన యెజెబెలు అతనికి దేవుడు లేని తల్లి. ఎలాగైనా ఈ కథ చిట్ట చివరకు చేరుకుంది (2 రాజులు 9).

రామోత్గిలాదు యుద్ధరంగంలో యెహోరాము గాయపడినాడు. సైన్యాన్ని నడిపించడానికి యెహూను నియమించి అతడు యెజ్రెయేలుకు వెళ్ళి పోయాడు. యెహూను తర్వాత రాజుగా అభిషేకించడానికి ఎలీషా ఒక ప్రవక్తను పంపించాడు.

యెహూ తన బలగాలతో యెజ్రెయేలుకు పయనమయ్యాడు. అతను పట్టణమునకు యింకా ఆరు లేక ఏడు మైళ్ళ దూరంలో ఉండగానే ఆ పట్టణ కావలివాడు గోడమీనుండి చూచి యెహూను గుర్తించాడు; యెహూను కలుసుకోడానికి ఒక వర్తమానికుని పంపించారు. యెహూ అతన్ని చూచి "నావెనుకకు తిరుగుము" (2 రాజులు 9:19) అన్నాడు. అతను అతని వెంటవెళ్ళినాడు. రెండవ వర్తమానికిని కూడ పంపించారు. యిక వాడు కూడ యెహూ వెనకాల స్వారీ చేస్తూ అనుసరించాడు. అప్పటికెల్లా యెహూ పట్టణానికి దరిదాపుల్లోకి వచ్చాడు, అది చూచిన కావలివాడు, "అతడు వెఱ్ఱి తోలడము తోలుచున్నాడు గనుక అది నింషి కుమారుడైన

యెహూ తోలడమువలెనే యున్నది" (2 రాజులు 9:20).

యెహోరాము మరియు యూదారాజు అహజ్యా యెహూను కలుసుకోడానికి వెళ్లారు: "... యెజ్రెయేలీయుడైన నాబోతు భూభాగంలో వారతన్ని ఎదుర్కొన్నారు" (2 రాజులు 9:21) – వారు ఇశ్రాయేలు రాజు భూభాగంలో కాదుగాని నాబోతు భూభాగంలో కలుసుకొన్నారు. దేవుని ఉద్దేశం ప్రకారం అది నాబోతుయొక్క స్వాస్థ్యము. ఒక కుటుంబానికివ్వబడిన స్వాస్థ్యము వేరే వారికి యివ్వబడకూడదు, చెందదు అని ధర్మశాస్త్రం చెబుతుంది.

యెహోరామును యెహూ చంపి పట్టణంలో ప్రవేశించాడు. ఏం జరుగుతున్నదో యెజెబెలు విన్నది, "ఆమె తన ముఖమునకు రంగుపూసుకొని శిరో భూషణములు ధరించుకొని కిటికిలోనుండి కనిపెట్టి చూచుచున్నది" (2 రాజులు 9:30).

> యెహూ గుమ్మముద్వారా ప్రవేశించెను. ఆమె అతనిని చూచి – నీ యజమానుని చంపినవాడా, [అతనిని జిమ్రీ వంటివాడా అని పిలిచాడు, ఎందుకనగా, జిమ్రీ మోసం చేత సింహాసనమును ఎక్కాడు.] జిమ్రీ వంటివాడా, నీవు సమాధానముగా వచ్చుచున్నావా అని అడుగగా అతడు తలయెత్తి కిటికి తట్టు చూచి – నా పక్షమందున్న వారెవరిని అడుగగా ఇద్దరు ముగ్గురు పరిచారకులు పైనుండి తొంగి చూచిరి. – దీనిని క్రింద పడద్రోయుడని అతడు చెప్పగా వారు దానిని క్రిందికి పడద్రోసినందున దాని రక్తములో కొంత గోడమీదను గుఱ్ఱములమీదను చిందెను. మరియు గుఱ్ఱములచేత అతడు దానిని త్రొక్కించెను. అతడు లోపల ప్రవేశించి అన్న పానములు చేసిన తరువాత – ఆ శాపగ్రస్తురాలు రాజకుమార్తె గనుక మీరు వెళ్లి దానిని కనుగొని పాతి పెట్టుడని ఆజ్ఞ ఇయ్యగా వారు దానిని పాతిపెట్ట బోయిరి; అయితే దాని కపాలమును పాదములును అరచేతులును తప్ప మరి ఏమియు కనపడలేదు. వారు తిరిగి వచ్చి అతనితో ఆ సంగతి తెలియజెప్పగా అతడిట్లనెను – ఇది యెజెబెలని యెవరును గుర్తుపట్టలేకుండ యెజ్రెయేలు భూభాగమందు కుక్కలు యెజెబెలు మాంసమును తినును (2 రాజులు 9:31-36 వచనాలు).

ఎవరైనా అడగవచ్చు, "బైబిలు ఈ విషయాలను గూర్చి చెప్తున్నదెందుకని? ఎందుచేతనంటే అది ఎంతో అసహ్యంగా ఉంది కదా అంటారు!" అది బహుశ అంత అందంగా కనిపించక పోవచ్చు, కాని పాపానికి ఫలితాలు అంత అందంగా ఉండవుకదా? నీవు గనుక పాపమనగా ఏంటో వివరంగా తెలుసుకోవాలనుకుంటే అహాబు యొక్క దంతాల భవనాన్ని చూడవద్దు కాని కుక్కలు అతని నెత్తురు నాకడం అనే హీనాతిహీనమైన దృశ్యాన్ని గమనించు. యెజెబెలమ్మ నగలు ధరించిన నగలను, దుస్తులను చూడకండి గాని ఆవురు ఆవురుమంటూ ఆకలితో అలమటించిన కుక్కలవంక చూడండి. పానీయం త్రాగడం గురించి ఎలుగెత్తి చాటుచున్న ప్రకటనలను గురించి తెలుపవద్దు గాని అన్యాయంగా చావబడిన అమాయక యువకుల మృతదేహాల ముక్కలు రాజమార్గాలకిరువైపుల విసరి పడవేసి ఉన్నాయి చూడండి. అశ్లీలత కలిగిన సినిమాలను లైంగిక సంబంధాల అనుబంధాల శ్రేష్ఠత యిదిగో అంటూ యింతింత అంతంత చేసే చిత్రాలను చూడవద్దుగాని **ఎయిడ్స్** అనే అంటువ్యాధి వ్యక్తులపై చేస్తున్న వికృతవిలయ తాండవాన్ని తిలకించండి.

## ముగింపు

అహాబు యెజెబెలుల కథ ఎంతో విషాదకరమైనది కాని అది కేవలం ఒక విషాద

కథ మాత్రమే కాదు. మరి ముఖ్యంగా దేవుడు మనకు సిద్ధంచేసిన పాఠాలను మనం గ్రహించవలసిన ఆవశ్యకత ఎంతోవుంది:

మొట్టమొదటిగా, దేవుని సహనానికి కూడ ఒకహద్దు ఉందని, ఓర్పు నశించిపోతుందని, మరి అది ఎప్పుడు సంభవిస్తుందో ఎవరికీ తెలియదు అని ఉన్నది. దేవుడు తన కృపాబాహుళ్యము, అపారమైన ప్రేమను బట్టి మనకిస్తున్న అవకాశాలను జారవిడచుకోవడం కన్న అపాయకరమైన పరిస్థితి ఏమిలేదు. మన ఈ చివరి పాఠంలో చెప్పబడిన "మరి తిరుగకుండ" అన్న పరిస్థితి మనం ఎప్పుడు చేరుకోగలమో చెప్పలేము. కొందరు దానికి చేరువలో ఉన్నారు అనడంలో ఎంతైనా వాస్తవముంది. మరికొందరు బహుశ ఆ పరిస్థితి దాటి వచ్చారు అన్నది కూడ నిజమే.

రెండవదిగా, దేవుని వాగ్దానాలు ఎంతో సత్యమైనవి – ఎవరు కూడ దానిని మార్చలేరు. దేవుడేదైనా సెలవిస్తే అది తూచతప్పక నిలుస్తుంది. మనం "యిది అసాధ్యం," ఆ మాట దేవుడే అంటే అది ఖచ్చితం అని భావించుకోవచ్చు. కొందరు అనవచ్చు, "నేను అహాబు, యెజెబెలు లాంటి చెడ్డదాన్ని / వాణ్ణి కాదు అని." అది కాదు యిప్పటి చర్చనీయాంశం, నీవు పాపివి (రోమీయులకు 3:23), పాపికి దేవుడిచ్చిన వాగ్దానమెంతో స్థిరమైనది ఎంతో స్పష్టంగా ఉన్నది: "పాపము యొక్క జీతము మరణం" (రోమీయులకు 6:23). దీనిని నమ్ముము వెంటనే ప్రభువు నొద్దకు పారిపోయి కృపకు వేడుకో!

మూడవదిగా, దేవుడేది ముందుగా సెలవిచ్చినా, అతని నోటనుండి బయటికి బయలుపరచినా దానినుండి ఆయన కరుణ కృప ఊటై పడుతుంది, దాన్ని ఏ మనిషీ కాదనలేడు. దేవుని వాగ్దానాలు అవి శాపవచనాలైనా, ఆశీర్వాదముతో కూడినవైనా, అవి కొన్ని షరతులతో కూడుకొని ఉంటాయి. ఆ షరతులు బహ్యంగా వ్యక్తపరచవచ్చు లేదా లోపలనే యిమిడియుండచ్చు. కఠిన హృదయుడైన అహాబు సైతం తన *ధీనత్వాన్ని* తగ్గింపును ప్రదర్శిస్తూ మూడు సంవత్సరాల పాటు దేవుని కోపాగ్నిని తప్పించుకున్నాడు. ఒకవేళ అహాబు గనుక తన నిజమైన విధేయతను, హృదయపూర్వకమైన పశ్చాత్తాపాన్ని కనుబరచినవాడై జీవించియున్నట్లయితే దేవుని ఉగ్రతనుండి శాశ్వతంగా తప్పించుకొని యుండేవాడు. దేవుని కృపను తృణీకరించవద్దు. ఆయన ఆశీర్వాదాలను అడిగిపొందండి.

మీ పట్ల దేవుడు తన సహనాన్ని కోల్పోకుండా చూచుకొనండి!

*రచయితనుండి ఒక్క మాట: R. G. Lee అనే దైవజనుడు చేసిన ఒక ప్రసంగం, "ఏదో రోజు జీతం యిచ్చే రోజువస్తుంది" ("Pay Day Someday,") ఆయన అహాబు యెజెబెలులను గూర్చి ప్రసంగించినాడు.*

---

సూచనలు

[1]ఈ పాఠ్య భాగంలో వేరే చోట యిదే సూత్రం వ్రాయబడింది. "ఆకస్మాత్తుగా" అనే పదం వాడబడింది. అది సామెతలు 6వ అధ్యాయం 12వ వచనం. యిక తర్వాత కొన్ని వచనాలు; "దుష్టుని స్వభావ లక్షణాలు"ను గురించి ఎలుగెత్తి చాటుచున్నవి. తర్వాత 15 వచనంలో వాడి గతి దుర్గతి గురించి వివరించబడింది: "కాబట్టి ఆపద వానిమీదికి *హఠాత్తుగా* వచ్చును; వాడు తిరుగులేకుండ ఆ క్షణమందే నలుగగొట్టబడును!" (నొక్కి చెప్పింది నాది.) [2]ఈ రోజుల్లో ఈ పట్టణం ఏవైపుగా ఉండేదో అని స్పష్టంగా గుర్తించలేక పోతున్నారు. [3]క్రొత్త నిబంధనలోని కొన్ని వాక్య భాగాలు ఈ పద్ధతినే ప్రతిబింబిస్తుంటాయి: "దేవుడు వారిని (అన్య జనులను) అపవిత్రతకు అప్పగించెను" (రోమీయులకు 1:24, 26, 28). యిక్కడ KJVలో చూచినట్లయితే యింకా వివరణాత్మంగా ఉన్నది

"దేవుడు వారిని విడిచిపెట్టేశాడు" ఎందుకంటే వారు కూడ దేవుని విడిచిపెట్టారు. కొందరు దూరంగా తొలగిపోయినవారు కఠిన హృదయులు అయిపోయారు "వారిని తిరిగి పశ్చాత్తాపమునకు మరల్చుట అసంభవమైన విషయం" (హెబ్రీయులకు 6:6). 1 యోహాను 5:16 "మరణానికి నడపించే పాపాన్ని గురించి" చెప్తుంది. [4]ఇంతకుముందు పాఠాన్ని చూడండి. [5]యిక్కడ ఈ పట్టణాలు ఒకదానికొకటి ఎంతెంతో దూరంలో ఉంటాయో అన్న విషయంలో అధికారికంగా కొంత విభేదం కలిగియున్నారు. [6]సంఖ్యాకాండము 36:1-9; 27:1-11 చూడు. [7]1 రాజులు 22:39 మరియు చూడు కీర్తనలు 45:8; ఆమోసు 3:15. [8]ఆమోసు 6:4. [9]అది బహుశ ఒక తెల్లని చలువరాయి, అచ్చం దంతాన్ని పోలివుంటుంది. [10]యిక్కడ KJVలో "బెనియాలు పుత్రులు" అని ఉన్నది. అంటే ఇది శబ్దార్థ ప్రకారము ఎలా అనువదింపబడిందంటే "పనికి మాలిన కుమారులు" అని ఉంది. అందుచేత NASB యింకా యితర ఆధునీకమైన అనువాదాలు కూడ అంతేవున్నాయి.

[11]19వ వచనం చూడండి. [12]యిది దేవుని చిత్తమేమి కాదు గాని పురాతన తూర్పు ప్రాంతంలో ఆచారంగా అనుసరించడం పరిపాటి అయింది. [13]Clyde M. Miller, *Living Word Commentary on First and Second Kings* (Abilene, Tex.: ACU Press, 1991), 298. [14]Ecclesiastes 8:11.

## దృశ్య సాధనాల-నోట్స్

**"దేవుడు చెప్పాడు, 'యింతవరకు చాలు!' "** అని పెద్ద అక్షరాలతో ఒక పెద్ద బోర్డు వ్రాసి ఉంచుకొనుము. ఈ పాఠమును పరిచయం చేయునప్పుడు దీన్ని అందరికి కనబడేలా ప్రదర్శించు. ఉదాహరణగా చూపించుము. తర్వాత దాన్ని దించివేయండి, దేవుడు అహాబు యెజెబెలులతో, "యింతవరకు చాలు!" అని దేవుడు మరల చెప్పిన సందర్భంలో మరోసారి ఆ బోర్డును అందరికి కనబడేలా చూపించు. మరల వారిద్దరు చనిపోయారని చెప్పి కథను ముగించేవరకు ఆ బోర్డును అలాగే ఉంచుము. చివరిలో అందరికి ఈ క్రింది మాటల ద్వారా ఆహ్వానం పలుకుము: "దేవుని కరుణను తృణీకరిస్తూ జీవితాన్ని కొనసాగనివ్వద్దు. దేవుడు నీతో 'యింతవరకు చాలు' " అని చెప్పడం నీవు వినాలనుకుంటున్నావా!

## పాఠం యొక్క సంక్షిప్త వర్ణన

### పరిచయం

A. దేవుని ప్రేమ ఆయన కరుణా కటాక్షాలను గురించిన పాఠాన్ని పఠించడంలో ఎంతో ఆనందించాం. కాని దేవుని పూర్తి సంకల్పాన్ని ఆసాంతం బోధించలేము (అపొస్తలుల కార్యములు 20:27) దేవుని న్యాయం, పరిశుద్ధత గురించి కూడ ప్రకటించకుండ – దేవుని మరో స్వభావం ఆయన పాపాన్ని సహించలేడు అన్న విషయాలెంతో ప్రాముఖ్యం. ఏలీయా మీద మనం చేస్తున్న అధ్యయనాల సరళి యిప్పుడు అలాంటి ఒక పాఠాన్ని మన ముందుంచుచున్నది.

B. 1 రాజులు 21వ అధ్యాయంలోనికి మనం వెళ్లక ముందు, మనం ఉదహరించబోవు ప్రతిదాన్ని ఎంతో సూత్ర ప్రాయంగా విశదీకరించుకుందాం:
   1. పాత నిబంధన వాక్య భాగం: సామెతలు 29:1; 6:12, 15
   2. ఉదాహరణలు:
      a. సొదొమా గొమొఱ్ఱాలు (ఆదికాండము 19)
      b. ఇశ్రాయేలు, యూదా రాజ్యాలు (2 దినవృత్తాంతములు 36)

    c. బెల్షస్సరు (దానియేలు 5)
    d. హేరోదు అగ్రిప్ప (అపొస్తలులు కార్యములు 12; గమనించు 23 వచనం)
  3. క్రొత్త నిబంధన వివరణ (రోమీయులకు 1; హెబ్రీయులకు 6; 1 యోహాను 5)

C. అహాబు మరియు యెజెబెలు యొక్క దుష్టత్వాన్ని గురించి మనం చూచాం. ఇప్పుడు మనం లేఖన భాగాలన్నింటిలో అతి హీనమైన కృత్యాలను చూస్తాం, మరియు "యింతటితో చాలు!" అని దేవుడనడం కూడ చూస్తాం.

## I. నాబోతుకు వ్యతిరేకంగా పాపము (21:1–16)

A. "ఈ సంగతులు జరిగిన తరువాత" (1ఎ వచనం):
  1. ఏలీయా రంగంలోనుండి అదృశ్యుడైనాడు.
  2. అహాబు, ఇశ్రాయేలీయులు యథావిధిగా వారివారి కార్యకలాపాల్లో నిమగ్నమైనారు.

B. అహాబు పొలం కావాలని కోరినాడు, నాబోతు మాత్రం అది అతనికి చెందనివ్వలేదు.
  1. 1వ వచనం: రాజధాని నగరమైన సమరయ యెజ్రెయేలుకు దక్షణంగా ముప్ఫై అయిదు లేక నలబై మైళ్ళు దూరం ఉన్నది.
  2. 2వ వచనం: అహాబు నాబోతు యొక్క ద్రాక్ష తోట కావాలనుకున్నాడు, కాని ఇశ్రాయేలీయులు కనానులో ప్రవేశించినప్పుడు ఆ భూభాగమంతా ఆ తెగలోని ఆయా కుంటుంబాలకు. అంతేగాక ఎవరికివ్వబడిన భూభాగం వారే *అనుభవించాలిగాని* యితరులకు యివ్వ కూడదు (లేవీయకాండము 25).
  3. 3వ వచనం: బయలుకు మ్రొక్కని ఏడువేల మందిలో నాబోతు ఒకడు.
  4. 4వ వచనం: అహాబు ఆ భూమి అతనికి దొరకనందున మూతి ముడుచుకున్నాడు.
  5. 5వ వచనం: అసలు సమస్య ఏంటో చూడడానికి యెజెబెలు వచ్చింది.
  6. 6వ వచనం: అహాబు "దుఃఖకరమైన కథను" ఆమెకు చెప్పినాడు.
  7. 7వ వచనం: యెజెబెలు, "ఏం ఫర్వాలేదు అంతా నేను చూచుకుంటా" అంటూ తన భర్తకు అభయమిచ్చింది.

C. ఆ పొలాన్ని సంపాదించుకోడానికి వారొక పన్నాగం పన్నినారు అది చివరకు దేవుని చట్టాన్ని ఉల్లంఘించినట్లయింది.
  1. 9వ వచనం:
    a. ఉపవాసం ప్రకటించబడింది. చట్టం నెంబర్ 1: దేవుని కోపాగ్నిని మరల్చుడానికి ఉపవాసాన్ని ప్రకటించబడింది.
    b. నాబోతుకు "ప్రజల్లో" ఒక గౌరవప్రదమైన స్థానం యివ్వబడింది. చట్టం నెంబర్ 2: ఈ ఉపవాసంలో ప్రజలంతా తూచా తప్పకుండ

పాల్గొనవలెను.

2. 10వ వచనం:
   a. నాబోతుకు వ్యతిరేకంగ అబద్ధాలు కల్పించడానికి కొందరు పనికి మాలిన వ్యక్తుల్ని లంచం యిచ్చి కుదిరించడం జరిగింది. చట్టం నెంబర్ 3: యిద్దరు లేక ముగ్గుపు సాక్షులు.
   b. వారు నాబోతును దేవ దూషణ చేశాడంటూ అనవసరంగా అతనిపై నింద మోపినారు. చట్టం నెంబర్ 4: దేవ దూషణ అనేది మరణా నంతరం శిక్షార్హమైంది. చట్టం నెంబరే 5: ఆ శిక్ష కూడ రాళ్లతో కొట్టి చంపడంద్వారా జరగాలి.

D. నాబోతు చంపబడినాడు, యెజెబెలు అహాబులు సంతోషించారు.
   1. నాబోతు చంపబడినాడు (అతను అతనింటిల్లిపాది; 2 రాజులు 9:26 చూడు).
   2. 14వ వచనం: యెజెబెలుకు వర్తమానం పంపించబడింది.
   3. 15వ వచనం: ఆమె అహాబుకు చెప్పింది.
   4. 16వ వచనం: అహాబు మరలా సంతోషించాడు.

**II. దేవుని ఓర్పు అంతరించిపోయింది (21:17-24, 27-29; 22:38; 2 రాజులు 9:21-36).**

A. ఏలీయా దేవుని సందేశాన్ని ప్రకటిస్తాడు.
   1. 17-19 వచనాలు: యెహోవా వాక్కు మరలా ఏలీయాకు ప్రత్యక్షమై.
   2. 20 నుండి 24 వచనాలు: ఏలీయా అహాబును కనుగొని దేవుని వాక్కును తెలియజేశాడు.
      a. నాబోతు రక్తాన్ని కుక్కలు ఎక్కడ నాకినవో అదే చోట అహాబు రక్తాన్ని నాకినవి (చూడు 19 వచనం).
      b. యెజ్రెయేలులో యెజెబెలు యొక్క శవాన్ని కుక్కులు తిన్నాయి (23 వచనం).
      c. యెహుతో సహా యింకా యితర వ్యక్తులు కూడ అక్కడ హాజరైయున్నారు (2 రాజులు 9:25). ఈ జరిగిన దృశ్యం, సందేశం యెహూ మనసులో చెరగని ముద్ర వేసుకున్నాయి.
   3. 27-29 వచనాలు: కొంత అద్భుతంగావుంది! భయకంపితుడైన అహాబు భిన్నుడై తన్ను తాను తగ్గించుకొన్నందున అనేక సంవత్సరాలవరకును దేవుని ఉగ్రతను తప్పించుకున్నాడు.

B. దురదృష్టవశాత్తు, అహాబు యొక్క పశ్చాత్తాపం కొద్ది కాలం మాత్రమే నిలిచింది. తనకేమి సంభవించలేదు గదా అని అతడు తన పాత జీవిత విధానానికి జారుకున్నాడు (గమనించు ప్రసంగి 8:11).

C. దేవుని భయంకరమైన విపత్తు వాగ్దానాలు నెరవేరినవి.
   1. అహాబు (1 రాజులు 22)

a. అహాబు మారు వేషంలో యుద్ధానికి వెళ్ళినాడు ఎలాంటి లక్ష్యం, గురిలేకుండ ఎవడో అనామకుడైన విలుకాడు ఎక్కుపెట్టి వదలిన విల్లు అహాబు శరీరంలోకి దూసుకుపోయింది.
b. 38వ వచనం: దేవుని వాగ్దానాలు నమ్మకమైనవి.

2. యెజెబెలు (2 రాజులు 9)
   a. ఇరవై సంవత్సరాలు దొర్లి పోయాయి ఏలీయా స్థానంలోకి ఎలీషా పంపించబడినాడు. అహాబు కుమారుడైన యెహోరాము సింహాసనము మీదనున్నాడు, అతని తల్లి రాణి యెజెబెలు నాస్తికురాలు. యిక అహాబు యెజెబెలుల కథ కంచికి చేరుకోబోతొంది ముగింపుకు వస్తుంది.
   b. 2 రాజులు 9:21, 25, 26, 30–36 చదవండి. అది ఎంతో దుఃఖపూరితమైన విషాద కథ!

**ముగింపు**

A. దేవుడు ఈ కథ ద్వారా మనం కొంత నేర్చుకోవాలని కోరుచున్నాడు.
   1. దేవుని సహనానికి కూడ కొంత హద్దు ఉంది – అది ఎప్పుడు సంభవిస్తుందో ఎవరికి తెలియదు.
   2. దేవుని వాగ్దానాలు నమ్మకమైన – వాటిని ఎవరూ మార్చలేరు.
   3. దేవుని వాక్కులో కృపవున్నది – దాన్నెవరూ కాదనలేరు.

B. దేవుడు కరుణామయుడనియు, దేవుడు న్యాయవంతుడనియు మనమెప్పటికి మర్చిపోకూడదు.